క్లుప్తంగా

చిలప్‌చెడ్ ఎంపీఓగా శరత్‌కుమార్ రెడ్డి



చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల ఎంపీఓగా శరత్‌కుమార్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. రేగోడు మండలంలో ఎంపీఓగా విధులు నిర్వర్తిస్తున్న ఆయన చిలప్‌చెడ్ ఎంపీఓగా వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని గ్రామాల్లో ఏ సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకొస్తే, సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానన్నారు. కాగా చిలప్‌చెడ్ ఎంపీఓగా విధులు నిర్వహించిన రమేశ్ హవేలి ఘనపూర్‌కు బదిలీ అయ్యారు.

బీజేపీ బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

పెద్దశంకరంపేట(మెదక్): బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా మరోసారి ఎన్నికైన గడ్డం శ్రీనివాస్ గారి ఆధ్వర్యంలో బీజేపీ బలోపేతానికి మరిన్ని చర్యలు చేపడుతామని బీజేపీ మండలాధ్యక్షుడు కోణం విఠల్ అన్నారు. శుక్రవారం బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేస్తామని అన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు శ్రావణ్‌కుమార్, మంగళి కృష్ణ, బి.కృష్ణ తదితరులు ఉన్నారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం



పిచికారీ డబ్బాలు అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

శివ్వంపేట(నర్సాపూర్): గ్రామాభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సేవలు అభినందనీయమని సర్పంచ్ పెద్దపులి రవి అన్నారు. మండల పరిధిలోని పిల్లుట్ల గ్రామంలోని పలువురు రైతులకు సెగల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పురుగుల మందు పిచికారీ డబ్బాలు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సర్పంచ్ మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం కోసం సెగల్ సంస్థ అందిస్తున్న సాయం వల్ల రైతులు ఆర్థిక అభివృద్ధి చెందాలన్నారు. గ్రామంలోని కుంటలను అభివృద్ధి చేసేందుకు ముందుకు రావడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సెగల్ ఫౌండేషన్ నిర్వాహకులు వేమ నారాయణ, మారుతి, సాయి రైతులు రాఘవరెడ్డి, బాలేశ్, శ్రీధర్‌గౌడ్, సుదర్శన్, సతీశ్ తదితరులు ఉన్నారు.

రహదారి నిబంధనలు పాటించండి



డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

పెద్దశంకరంపేట(మెదక్): ప్రతీ ఒక్కరూ రహదారి నిబంధనలు తప్పకుండా పాటించాలని హైవే పెట్రోలింగ్ సిబ్బంది, కేఎస్ఆర్ హైవేస్ ఆధ్వర్యంలో శుక్రవారం వాహనదారులకు కోళపల్లి పాత టోల్‌ప్లాజా వద్ద తెలిపారు. 35వ జాతీయ రహదారి భద్రత వారోత్సవాల సందర్భంగా ఓవర్ లోడింగ్, అతివేగంగా ప్రయాణించడం, రహదారిపై పార్కింగ్ తదితర అంశాలపై డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపొద్దని సూచించారు. కార్యక్రమంలో హైవే పెట్రోలింగ్ సిబ్బంది షరీఫ్, కృష్ణయ్య, ఐఎంఎస్ మేనేజర్ ఖాజామోయినొద్దీన్, పీఆర్ఓ శివకుమార్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఎస్టీయూ అసోసియేట్ జిల్లా అధ్యక్షుడిగా శివప్రసాద్



చిన్నశంకరంపేట(మెదక్): ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం అసోసియేట్ జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని సూరారం ప్రాథమిక పాఠశాల హెచ్ఎం శివప్రసాద్‌ను ఎన్నుకున్నట్లు ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పోచయ్య తెలిపారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ.. తన ఎన్నికకు సహకరించిన ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజ్‌గోపాల్‌గౌడ్, పోచయ్యలకు ధన్యవాదాలు తెలిపారు. ఉపాధ్యాయ సమస్యలపై సంఘంతో కలిసి పోరాడుతానని తెలిపారు. సీపీఎస్ పెన్షన్ విధానం రద్దు చేసి, పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. బదిలీ అయిన ఉపాధ్యాయులకు ఎస్‌జీటీ టీచర్లకు పదోన్నతులు కల్పించాలని కోరారు.

పకడ్బందీగా అభివృద్ధికి ప్రణాళికలు



వెల్దుర్తి(తూప్రాన్): అధికారులకు సూచనలిస్తున్న ఎంపీడీఓ వెంకటలక్ష్మమ్మ

వెల్దుర్తి(తూప్రాన్): గ్రామ పంచాయతీల్లో ప్రాథమిక అవసరాలను గుర్తించి, సదుపాయాలు కల్పించేందుకు పకడ్బందీగా అభివృద్ధికి ప్రణాళికలు చేపట్టాలని ఎంపీడీఓ వెంకటలక్ష్మమ్మ అన్నారు. శుక్రవారం గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారు చేయడానికి గ్రామసభలపై ఎంపీడీఓ కార్యాలయంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఈ నెల 27 వరకు వివరాలన్నింటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉందని, అధికారులు నిర్లక్ష్యం వహించకుండా వెంటనే స్పందించాలని కోరారు. సమావేశంలో పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్, పశుసంవర్ధక శాఖ, ఐకేపీ, మిషన్ భగీరథ, రోడ్లు, భవనాల శాఖ, విద్యుత్ శాఖ అధికారులు, కార్యదర్శులు, ఎంపీఓ విఘ్నేశ్వర్, ఈజీఎస్ ఏపీఓ రాజు పాల్గొన్నారు.

కౌడిపల్లి(నర్సాపూర్): గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో జీపీడీపీ(గ్రామ పంచాయతీ డెవలప్‌మెంట్ ప్లానింగ్)పై వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం 2030 సంవత్సరం వరకు నిర్ణయించి లక్ష్యాలను చేరేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ కలీముల్లా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శశికళ, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు ప్రభాకర్, అరవింద్, ఏపీఓ పుణ్యదాస్, పీహెచ్‌సీ సూపర్‌వైజర్ రమేశ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రణాళికలు రూపొందించండి



చిన్నశంకరంపేటలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

చిన్నశంకరంపేట(మెదక్): గ్రామాల అభివృద్ధికి గ్రామసభలు నిర్వహించి ప్రణాళికలు రూపొందించాలని ఎంపీడీఓ ప్రవీణ్ కోరారు. చిన్నశంకరంపేట ఎంపీపీ సమావేశ మందిరంలో గ్రామ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 27 వరకు గ్రామసభలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ గిరిధర్‌రెడ్డి, పీఆర్‌ఏఈ విజయ్‌కుమార్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాయిసింధు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతీ పాల్గొన్నారు.



చేగుంటలో మాట్లాడుతున్న ఈఓ నాగభూషణం

చేగుంట పంచాయతీలో సమీక్ష

చేగుంట(తూప్రాన్): గ్రామ పంచాయతీ అభివృద్ధిపై ప్రణాళిక సంఘం సభ్యులతో చేగుంట గ్రామ పంచాయతీలో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి నాగభూషణం 15వ ఆర్థిక సంఘం నిధులను 2024 ఆర్థిక సంవత్సరంలో చేసే ఖర్చులపై సభ్యులతో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి పనులకు ఖర్చుచేయడంలో ప్రాధాన్యత కల్పించాలనే విషయాలను సభ్యులను అడిగి తెలుసుకున్నారు. సభ్యులతో చర్చించిన అంశాలను నమోదు చేసి అభివృద్ధి కోసం చేసే ఖర్చుల నివేదికను ఉన్నత అధికారులకు పంపించనున్నట్లు ఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు లక్ష్మణ్, లైన్‌మెన్ శ్రీనివాస్, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్యశాఖ అధికారులు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు



పరీక్ష ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న అధికారులు

నర్సాపూర్‌రూరల్: వచ్చే విద్యా సంవత్సరంలో ఆరో తరగతిలో ప్రవేశానికి ఈనెల 20న ప్రవేశ పరీక్ష నిర్వహించడానికి నర్సాపూర్ బ్లాక్ స్థాయిలో రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసింది. జెడ్పీహెచ్ఎస్ బాయ్స్ నర్సాపూర్ కేంద్రంలో 168 మంది విద్యార్థులు, విష్ణు పబ్లిక్ హైస్కూల్ నందు 206 మంది విద్యార్థులు పరీక్ష రాస్తున్నారు. పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. పరీక్ష ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 1: 30 నిమిషాల వరకు ఉంటుంది. విద్యార్థులు గంట ముందే పరీక్ష కేంద్రాన్ని చేరుకోవాలి. విద్యార్థులు తమ వెంట హాల్ టికెట్, రైటింగ్ ప్యాడ్, బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ తీసుకొని రావాలి. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఉంటుంది. జెడ్పీహెచ్ఎస్ బాయ్స్ నర్సాపూర్ చీఫ్ సూపరింటెండెంట్ సామ్యా నాయక్, సెంటర్ లెవెల్ అబ్జర్వర్ కృష్ణమూర్తి, విష్ణు పబ్లిక్ స్కూల్ నర్సాపూర్ చీఫ్ సూపరింటెండెంట్ తారా సింగ్, సెంటర్ లెవెల్ అబ్జర్వర్ హైమావతిలను నియమించారు.

ఈ పాస్ ద్వారా ఎరువులు విక్రయించండి



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారి

శివ్వంపేట(నర్సాపూర్): రైతులకు ఎరువులు ఈ పాస్ మిషిన్ ద్వారా విక్రయించాలని వ్యవసాయ శాఖ నర్సాపూర్ డివిజన్ సహాయ సంచాలకులు సంధ్యరాణి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నకిలీ ఎరువులు విక్రయిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు. విక్రయాలకు సంబంధించి రికార్డులు సక్రమంగా నమోదు చేయాలని, రైతులకు నాణ్యమైన ఎరువులను అమ్మలన్నారు. యాసంగి సాగుకు సంబంధించి ఎరువులు అందుబాటులో ఉన్నాయని రైతులు ఎలాంటి ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి లావణ్య, డీలర్లు స్వామిగౌడ్, కిషోర్‌గౌడ్ ఉన్నారు.

రేషన్ దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్లు ఉండాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ గ్రేస్‌బాయి

పెద్దశంకరంపేట(మెదక్): ప్రతీ రేషన్ దుకాణంలో స్టాక్ రిజిస్టర్లు తప్పనిసరిగా ఉండాలని తహసీల్దార్ గ్రేస్‌బాయి అన్నారు. శుక్రవారం పేటలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మండలంలోని రేషన్ డీలర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అన్ని రేషన్ దుకాణాల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా రేషన్ బియ్యాన్ని అందించాలని, వారికి డీలర్లు అందుబాటులో ఉండాలన్నారు. పౌర సరఫరాల గోదాం నుంచి బియ్యం సరఫరాపై వస్తున్న ఇబ్బందులను ఉన్నత అధికారులకు నివేదిస్తామన్నారు.

రాష్ట్ర వీరశైవ లింగాయత్, లింగబలిజ దశాబ్ది ఉత్సవాలు

అల్లాదుర్గం(మెదక్): రాష్ట్ర వీరశైవ లింగాయత్, లింగబలిజ సంఘం దశాబ్ది ఉత్సవాలు శనివారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహిస్తున్నట్లు సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు శివశరణ్ శుక్రవారం విలేకర్లతో చెప్పారు. ఈ ఉత్సవాలకు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, బీసీ సంక్షేమ శాఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ్య సభ్యుడు కృష్ణయ్య, ఎంపీ బీబీ పాటిల్‌లు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని వీరశైవ లింగాయత్, లింగబలిజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

శివ్వంపేట(నర్సాపూర్): ఎస్‌జీటీయూ 2024 సంవత్సర క్యాలెండర్‌ని శుక్రవారం శివ్వంపేటలో ఎంఆర్‌సీ కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో ఎంఈఓ బుచ్చనాయక్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరికెల వెంకటేశం, రాష్ట్ర ఉపాధ్యాక్షుడు సత్తయ్య, మండల అధ్యక్షుడు సురేశ్, శివ్వంపేట కాంప్లెక్స్ హెచ్ఎం బాలచంద్రం, ఉపాధ్యాయులు రామకృష్ణ, కుమార్, జీవరత్నం, సూర్యారావు, మధుసూదన్, రవి, లావణ్య, జ్యోతి, తదితరులు ఉన్నారు.

నడకదారికి మరమ్మతులు

శివ్వంపేట(నర్సాపూర్): సికింద్లాపూర్ లక్ష్మీ నర్సింహస్వామి జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. పాత ఆలయం నుంచి స్వయంభుగా గుట్టపై వెలసిన లక్ష్మీనర్సింహస్వామి ఆలయం వరకు నడకదారి బాగాలేకపోవడంతో శుక్రవారం మొరంపోసి చదును చేశారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తిస్థాయి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈఓ శశిధర్‌గుప్తా తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు ధనుంజయ్‌శర్మ, సీనియర్ అసిస్టెంట్ నర్సింహరెడ్డి తదితరులు ఉన్నారు.

సైబర్ నేరగాళ్ల వలలో పడొద్దు



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ షేక్ మహబూబ్

చిలప్‌చెడ్(నర్సాపూర్): సైబర్ నేరగాళ్లు సాంకేతికతను ఉపయోగించి, పలు రకాల వ్యూహాలతో ఖాతాలోని డబ్బులు దొంగిలిస్తున్నారని ఎస్ఐ షేక్ మహబూబ్ అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని సోమక్కపేట్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సైబర్ నేరాలు, బాల్య వివాహాలపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు మొబైల్ ఫోన్లతో గేమ్స్ ఆడుతూ.. అనవసర లింక్‌లు క్లిక్ చేస్తే, సైబర్ నేరగాళ్ల వలలో చిక్కే ప్రమాదముందని చెప్పారు. సైబర్ నేరగాళ్ల మాయలో పడి బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు, తదితర వివరాలు ఇచ్చి మోసపోకూడదని హెచ్చరించారు. అదేవిధంగా విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా చదువుపై ఆసక్తి చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐ శ్రీధర్, జీఎమ్మార్ ప్రతినిధులు

తూప్రాన్: వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలని సీఐ శ్రీధర్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణ సమీపంలోని టోల్‌ప్లాజా వద్ద జీఎమ్మార్ కార్యాలయం వద్ద జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఐ శ్రీధర్ హాజరయ్యారు. అనంతరం సీఐ మాట్లాడుతూ.. ప్రతీ ఏడాది జనవరి 15 నుంచి ఫిబ్రవరి 15 వరకు రోడ్డు భద్రత మహోత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. హెల్మెట్ లేకుంటే ప్రయాణం చేయడం నేరం అన్నారు. మద్యం సేవించి వాహనం నడపొద్దని, పెద్దలు తమ పిల్లలకు వాహనాల ఇవ్వకుండా అరికట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఆ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ వెంకటరమణ, హజరత్ రెడ్డి, టోల్ మేనేజర్ సచిన్, ప్రతినిధులు శ్రీనివాస్, ప్రవీణ్, చిటుకుల ప్రవీణ్ కుమార్, పట్నాయక్ పాల్గొన్నారు.

గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

చిన్నశంకరంపేట(మెదక్): గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన ఉన్నప్పుడే బాలబాలికలు ప్రమాదాల నుంచి తమకు తాము రక్షణ పొందగలరని నేషనల్ గర్ల్‌చైల్డ్ ఆర్గనైజేషన్ జిల్లా కో ఆర్డినేటర్ సంతోషి తెలిపారు. శుక్రవారం చిన్నశంకరంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బేటిబచావో.. బేటీపడావో కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలబాలికలకు ఎదురయ్యే సమస్యలను వివరించారు. చట్టాలపై అవగాహన ఉండాలని తెలిపారు. ఫోక్స్ చట్టంతో పాటు బాలబాలికల రక్షణ కోసంబేటిబచావో బేటీపడావో నిర్వహిస్తున్నట్లు భరోసా కేంద్రం మెదక్ జిల్లా ఆర్గనైజర్ సౌందర్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగేందర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలకు రుణాలు

ఏపీఎం సంగమేశ్వర్

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలో డ్వాక్రా మహిళలకు రూ 35.11కోట్లు రుణాలు ఇవ్వడం లక్ష్యంగా నిర్ణయించినట్లు ఏపీఎం సంగమేశ్వర్ తెలిపారు. శుక్రవారం కౌడిపల్లి ఐకేపీ కార్యాలయంలో మండల సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని డ్వాక్రా మహిళలకు ఈనెల ఆఖరులోగా బ్యాంక్ ద్వారా రూ. 31.50కోట్లు రుణాలు ఇవ్వాల్సి ఉండగా.. ఇప్పటి వరకు రూ. 24కోట్లు రుణం ఇచ్చామని చెప్పారు. స్త్రీనిధి ద్వారా రూ 3.61కోట్లు రుణం ఇవ్వాల్సి ఉండగా, రూ. 1కోటి ఇచ్చినట్లు తెలిపారు. లక్ష్యం మేరకు మిగతా రుణాలు పంపిణీ చేయాలన్నారు. మండలంలోని దేవులపల్లి, కూకుట్లపల్లి, కౌడిపల్లి, కొట్టాల గ్రామాల్లో రూ. 72లక్షల మొండి బకాయిలు ఉన్నాయని వన్‌టైం సెటిల్‌మెంట్ ద్వారా వడ్డీలేకుండా అప్పు చెల్లింపుకు అవకాశం ఉందని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు మమత, సీసీలు దత్తు, నాగరాజు, శ్రీకాంత్ మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఇంటింటికీ అయోధ్య అక్షింతలు



కౌడిపల్లి(నర్సాపూర్): లింగంపల్లిలో అయోధ్య అక్షింతలతో ర్యాలీ



చేగుంట(తూప్రాన్): పోతాన్‌పల్లిలో అక్షింతలను స్వీకరిస్తున్న హైదర్‌బీ

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని లింగంపల్లిలో శుక్రవారం అయోధ్య అక్షింతలను పంపిణీ చేశారు.

చేగుంట(తూప్రాన్): మండలంలోని పోతాన్‌పల్లి గ్రామంలో అయోధ్య అక్షింతలను ముస్లిం కుటుంబాలు స్వీకరించారు. అయోధ్య అక్షింతల పంపిణీలో భాగంగా పోతాన్‌పల్లిలో ఇంటింటికీ అక్షింతల పంపిణీ చేశారు. కార్యక్రమంలో జగన్‌గౌడ్, నాయకులు బాలసాయి హరిప్రసాద్, భక్తులు పాల్గొన్నారు.

కొత్తచెరువు పరిశీలన

కౌల్దారం(నర్సాపూర్): రంగంపేటలోని కొత్తచెరువు కబ్జాకు గురైందన్న గ్రామస్తుల ఫిర్యాదు మేరకు శుక్రవారం మండల నీటి పారుదల శాఖ ఏఈ మహేశ్‌కుమార్ చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు చెరువు శిఖం భూమిని నాలుగు ఎకరాల మేర అక్రమంగా దున్నడమే కాకుండా, బోరు సైతం నిబంధనలకు విరుద్ధంగా వేశారన్నారు. రెండు రోజుల్లోగా దున్నిన శిఖం భూమిని యథావిధిగా చేయకుంటే, ఇరిగేషన్ శాఖ యాక్ట్ ప్రకారం శాఖపరమైన చర్యాజీ సదరు వ్యక్తులపై క్రిమినల్ కేసు నమోదు చేస్తామని తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ **నిందితుడి అరెస్ట్**

చిన్నశంకరంపేట(మెదక్): పాఠశాల తాళం పగులకొట్టి కేబుల్ వైరు చోరి చేసిన నిందితుడు వాహనాలను తనిఖీ చేస్తుండగా పట్టుబడినట్లు ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని గుర్తించిన పోలీస్‌లు వాహనాల తనిఖీలో అదుపులోకి తీసుకొని విచారించామన్నారు. కేబుల్‌వైరును స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

◆ **మదన్‌రెడ్డికి మెదక్ ఎంపీ టికెట్ ఇవ్వాలి**



నర్సాపూర్ రూరల్: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరఫున మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డికి ఎంపీ టికెట్ ఇవ్వాలని నర్సాపూర్ పట్టణాధ్యక్షుడు భిక్షపతి కోరారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ.. మెదక్ ఎంపీ టికెట్ మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డికి కేటాయించకుంటే నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి నష్టం వాటిల్లితుందన్నారు.

◆ **కల్లు దుకాణం తనిఖీ**



పాపన్నపేట(మెదక్): మండలంలోని నార్సింగి గ్రామంలోని కల్లు దుకాణాలను ఎక్సైజ్ డీటీఎఫ్ సీఐ నరేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో కల్లు దుకాణాల్లో తనిఖీలను నిర్వహించారు. ఈ సందర్భంగా కల్లుకు సంబంధించిన శాంపిల్స్‌ని సేకరించి ల్యాబ్‌కు పంపిస్తున్నట్లు సీఐ తెలిపారు. ఈ మేరకు నిర్వాహకుడు గోపాల్‌గౌడ్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

◆ **అక్రమంగా మట్టి రవాణా చేస్తే కఠిన చర్యలు**

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ మట్టి రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి శుక్రవారం అన్నారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రంగాయపల్లి, కొండాపూర్ శివారులో అక్రమంగా మట్టి రవాణా చేస్తున్న రెండు టిప్పర్లను పట్టుకొని సీజ్ చేసినట్లు తెలిపారు.

◆ **బంగారు ఆభరణాలపై రుణాలు**

పాపన్నపేట(మెదక్): ఐదు నిమిషాల్లోనే బంగారు ఆభరణాలపై రుణాలను అందజేస్తామని సహకార బ్యాంకు డీజీఎం భీమెందర్ అన్నారు. మండల కేంద్రం పాపన్నపేట సహకార బ్యాంకులో శుక్రవారం డీజీఎం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సహకార బ్యాంకు వినియోగదారులకు సత్వర సేవలను అందించడంతో పాటు ఫిక్స్‌డ్ డిపాజిట్లపై అన్ని బ్యాంకుల కంటే ఎక్కువ వడ్డీ అందిస్తున్నట్లు తెలిపారు. రైతు నేస్తం స్కీంతో వ్యవసాయం కోసం 2లక్షల రుణం, మహిళ సంఘాల సభ్యులకు ఒక్కో సంఘానికి గరిష్ఠంగా 20 లక్షల రుణం అందిస్తామన్నారు. గంట వ్యవధిలో అకౌంట్‌ను ఇవ్వడంతోపాటు వెంటనే ఎటీఎం కార్డును అందిస్తామన్నారు. ఈసమావేశంలో డీజీఎంతో పాటు బ్యాంకు మేనేజర్ కిషన్ సిబ్బంది ఉన్నారు.

◆ **ఇరువురిపై కేసు**

శివ్వంపేట(నర్సాపూర్): దాడి ఘటనలో ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవికాంత్‌రావు శుక్రవారం తెలిపారు. మండల పరిధిలోని బీమ్లా తండాకు చెందిన కాంత్రోత్ గంగా అతడి భార్య అనితపై అదే తండాకు చెందిన గుగులోత్ నామ్‌సింగ్, అతడి భార్య శాంతి, కొడుకు రాకేష్, కోడలు లత దాడి చేశారన్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. నామ్‌సింగ్‌పై దాడికి పాల్పడిన వారిపై సైతం కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

◆ **కేంద్ర పథకాలపై అవగాహన**



నర్సాపూర్ రూరల్: మండలంలోని ఎల్లాపూర్‌లో శుక్రవారం ప్రభుత్వ అధికారులు వికాసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా కేంద్ర పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, సర్పంచ్ పద్మ ఆంజనేయులు, బీజేపీ మండలాధ్యక్షుడు నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

◆ **ఎమ్మెల్యే నిర్ణయం స్వాగతిస్తున్నాం**

చిన్నశంకరంపేట(మెదక్): గ్రామాల్లో బెల్ట్‌షాపుల నియంత్రణకు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని కాంగ్రెస్ నాయకుడు రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం చిన్నశంకరంపేటలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో మద్యం అనేక రకాలుగా ప్రజలను నష్టపరుస్తుందని గ్రహించి బెల్ట్‌షాపుల నియంత్రణ నిర్ణయం తీసుకున్న ఎమ్మెల్యేకు అభినందనలు తెలిపారు.

◆ **దరఖాస్తుల ఆహ్వానం**

కౌల్దారం(నర్సాపూర్): మండల కేంద్రం కౌల్దారంలో కొనసాగుతున్న కస్తూర్బా గాంధీ బాలికల ఆశ్రమ పాఠశాలలో పగటిపూట వాచ్ మెన్‌గా పని చేసేందుకు ఆసక్తి గల మహిళలు ఈనెల 22 వరకు దరఖాస్తు చేసుకోవాలని ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపల్ ధరణి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు 95730 82435 మొబైల్ నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

◆ **గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్ మృతి**



యాదగిరి (ఫైల్)

రామాయంపేట(మెదక్): మెదక్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న భీమన్నగారి యాదగిరి (53) గురువారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.